# అమావాస్యవెన్నెల

కొటూరి శ్రీమూర్తి &
భానుమూర్తి




"వద్దురా" — అన్నాను!

"హాయిగా ఏ అగ్గిపెట్టెల పరిశ్రమో పెట్టరా" అని నచ్చజెప్పాను వింటేనా?!

"ఇంకా నయం! తేనెటీగల పరిశ్రమ పెట్ట మన్నావు కాదు డబ్బు నాది పోతే నష్టం నాది నీ కెందుకు బాధ? నే చెప్పినట్టు చెయ్యి" శాసించాడు

ఇంకేదన్నా అభ్యంతరాలు పెట్టి ఉందునేమొ గానీ, వాడి నోరు అసలు మంచిది కాదు!

"సరే—నీ యిష్టప్రకారమే కానియ్యి! పేరేం పెట్టదలిచావ్?" సోఫాలో వెనక్కి వాలేను

"అదే చూస్తున్నా బాగా ఆకర్షణగా 'క్యాచీ'గా ఉండాలి"

"రెండక్షరాలా, మూడక్షరాలా?"

"నా న్యూమరాలజీ ప్రకారం మూడక్షరాలే ఉండాలి"

"మధ్యన అదొకటి కూడానా?! సరే—నీకు తోచినవి చెప్పు నాకు తోచినవి నేను చెబుతాను"

"కరుణ, అరుణ, మాధవి, శిరీష"

"ఒరేయ్ ఆగాగు! ఏవిటి వీళ్లంతా నీ ఆడ స్నేహితులా?" గాభరాగా అడ్డుకున్నాను

"ఇంకా నయం ప్రియురాళ్లా అన్నావ్ కాదు. నేనేమన్నా కృష్ణ పరమాత్మ ననుకున్నావా? మరీ అమాయకత్వంగా మాట్లాడతావేంరా ఫూల్? ఈ రోజుల్లో ఆకర్షణ అన్నింటి కన్నా ప్రధానం!"

"సరుకున్నా లేకపోయినా ఫర్వాలేదన్నమాట! ఒరేయే, నన్నిలాంటి కల్తీ బేరాల్లోకి దింపకు నాకు గిట్టదు" ఖండితంగా చెప్పేసాను

"ఒరేయ్, నిన్ను బతిమిలాడ్డంతోటే సగం అలిసిపోయాన్నేను నా ఉత్సాహం చంపకు తెలుగు దేశానికింత ఉపకారం చెయ్యనియ్!"

"వహ్వా! చాలా బావుంది నువ్వు చెయ్యనంతలో తెలుగుదేశంలో దీపం వెలగదనుకోకు."

"ఆగాగు ఒరేయ్, మంచి హింటిచ్చావ్! దీపం ..వెలుగు...వెన్నెల...శభాష్! బావుందొరేయ్.. 'వెన్నెల' అని పెట్టేద్దాం. ఎలా ఉంది?

"వెన్నెల లాగానే ఉంటుంది, జాగ్రత్తగా కృషిచేస్తే!"

"డబ్బునాది—కృషినీది! ఏమంటావ్?"

"ఆనేందుకు ఏ ముందీ? పెట్రోలుంది. కారుంది. డ్రైవర్‌ని నేమన్నాను. ఛలోబేటా ఛల్! అంటూ అదిలించడమే తరువాయి.."

"సరే, పేపర్లో యివ్వాల్సిన ప్రకటన నువ్వే చూడు.."

* * *

"ఒరేయ్, చాలా వచ్చినాయిరా"

"చాలా అంటే?"

"నాలుగొందలు!"

"హతోస్మి! నా కింతవరకూ యింతమంది రచయిత లున్నారనే తెలియదు తెలుగు పత్రికలు దివాలా ఎందుకు తీస్తాయొ నా కర్థం గావటం లేదు"

నవ్వేను

"నీ కింకా తెలుగు దేశమే అర్థం కాలేదు ఇంకా సేవా సపర్యలేమి చేస్తావ్?"

"మరీ అంత కొట్టిపారెయ్యకు మరీ పొరుగు రాష్ట్రంవాడిలా తెలుగు దేశమంటే 'గోంగూర వనం' అనటం లేదుగా?"

"అయితే విను! మనవాళ్లల్లో రాసేవా ళ్లెక్కువ ఆ ఎక్కువలో చాలా తక్కువమందికి మాత్రమే నిజంగా రాయడం వచ్చు"

"ఎందుకని?" అమాయకంగా అడిగేదు రాజు

"మనం ఎంతో ఆహారం తింటున్నాం తిన్న దంతా రక్తంగా మారిపోతుందా?"

"లేదనే చదివేను సైన్సులో!"

"అసలేమీ తినకుండా ఉంటే?"

"అదేమిటో మరీను అయిదో క్లాసు ప్రశ్నలూ నువ్వూను ఉపోషాలున్నవాడికి ఓపికేం ఉంటుంది?"

"అవునా? మరి బొత్తిగా విషయ పరిజ్ఞానం లేనివాడు రాసే రాతల్లో సారమేముంటుంది?"

"ఆలోచించాల్సిన సంగతే!"

"ఈ ఆలోచన కొరవడి నందువల్లే, మన దేశంలో - అంటే, తెలుగు రాష్ట్రంలో ముఖ్యంగా— పుస్తకాలమ్ముడవటం యజ్ఞం"

"మరి కొన్ని పుస్తకాలు 'హాట్ కేక్సు'లా అమ్ముడవుతాయే!"

"అవి వాటి స్థాయినిబట్టి! అమ్ముడు కావడమే ముఖ్యమనుకుంటే సెక్సు పుస్తకాలు దొరకనంతగా అదృశ్యమైపోవటంలా!"

"ఒరేయ్! మన పత్రిక పెక్సుకి అతీతంగా, నిఖార్సయిన సాహిత్య ప్రయోజనాలకు అంకితమై"

"అప్పుడుగానీ కాబూలీవాలాలు నీ వెంట పడరు!"

"అదేమిట్రా?!"

"అంతేమరి పత్రికకు వ్యాపార దృష్టికూడ లేకపోతే బతకదు!"

"నా కవేమీ చెప్పకు! కాగితం కావాలన్నావ్ ఆరు సంచికలకు సరిపడ తెచ్చిపడేసాను మిగతావన్నీ రెడీ 'వెన్నెల' యీ దీపావళి కల్లా వచ్చెయ్యాలి."

"ఆ రోజు అమావాస్య!" నవ్వేసాను

## ప్రశ్నావళి

## కె రామలక్ష్మి

డి. వి. ఎస్. ఎమ్. కాకినాడ

స్త్రీ గృహ రాజ్ఞీయత్వానికి తన చేతులతో తానే తిలోదకాలిచ్చి సమస్తావకాశాలనీ సర్వే చేసి రావాలని మనస్సు పెంచుకుని ముందుకు వెడుతోం దంటారా ? వెనక్కి వెడుతోందంటారా ?

★ అది చూసే మీ దృష్టినిపట్టి వుంటుంది. క్యూరియాసిటీ అపరాధం కాదే !

ఎ టి. విశాఖపట్నం

కె రా గారూ మీరు ఆ మధ్య విజయవాడ రచయిత్రుల సభలో మాట్లాడుతూ ఆడవారి పేరుతో మగవారు రచనలు చేస్తున్నారన్నారు నాకు మీమీద బలే కోపం వచ్చింది.

★ నిజం విని ఉడుక్కుంటే ఎలా ?!

కె ఆర్. కె. పాలకొండ

చరణదాసి అంటే అర్థం ?

★ జోళ్లు అందించేదని అనుకుంటాను !

జె. ఎస్. ఆర్ జయపురం

చెడుకే విజయం అందించడం భగవంతునికి వేడుకా ?

★ కాదు — మానవుని సత్ శీలానికి పరీక్ష.

కె. ఆర్. కె. ఎస్. కె. జె. మొదలైనవారు, కాజారు

ఈ దేశం ఎప్పుడు బాగుపడుతుంది ?

★ ఇప్పుడందుకేగద మన ప్రధాని పునాదులు వేస్తున్నారు

కె టి. ఎస్. ఎన్ బి—ఆర్ పల్లి

సమాజం అంటే ఏమిటి ?

★ మీరూ — నేనూ — మీ చుట్టూవాళ్లూ నా చుట్టూవాళ్లూ — అంతా కలిసే సమాజం.

సిహెచ్ వి ఆర్. అనపర్తి

అందరికీ ఇది మహిళా సంవత్సరం కాని మీకు అన్నీ మహిళా సంవత్సరాలే కదండీ ?

★ చిత్తం కాని కాకి దృష్టిలా మా కన్ను కొక్కదానికే చూపు వుండి లాభం లేదని — యీ ప్రత్యేక సంవత్సరం సూచించారు !

కె. ఎస్. ఆర్. ముమ్మిడివరం

వైరాగ్యం అన్న పదానికి అర్థం ఏమిటి ?

★ ఈ జీవితాన్ని — దాని ఫలితాలని — నిర్వి కారంగా, తామరాకుపై నీటిబొట్టులా అనుభవిం చేయడం

జి. ఎస్. ఆర్. సికింద్రాబాదు

'మ్యాన్ టు కమేండ్, వుమెన్ టు వొబే' అన్న మాట వినలేదనుకుంటాను

★ అలాంటి చెత్త వార్తలు విన్నా — తల్లో నిలవనివ్వను !

కె ఎల్. ఆర్. హైద్రాబాదు

విజయం గర్వకారణం కదా ?

★ కీర్తి ప్రతిష్టల కోసం ఎదురుచూస్తూ - సాధించే విజయం గర్వకారణం కాదు మన నైపుణ్యాన్ని సద్వినియోగం చేయడానికి పనికివచ్చేదే — గర్వకారణం అవుతుంది

## అమావాస్య–వెన్నెల

"అయితేనేం ? దాన్ని అందమయిన అమా వాస్యగా మార్చేద్దాం !"

"సర్లే కానియ్ ! ఈలోగా యీ కథల్ని వడ పొయ్యనీ "

* * *

"ఒక ఎనభై కథల దాకా తేలాయిరా ! ఒక పాతిక కథలు నిజమయిన సరుకున్నవి ఆ పాతికలో పది మాత్రం నాణ్యమైనవి ఒక్క అయిదు ఉన్నత ప్రమాణాలతో ఉన్నాయి !" అన్నాను

"మరీ అన్యాయంగా మాట్లాడతావేంరా ? ! మరీ 'న్యూస్ ఐటవ్'లా ఉంది ఎనభై ఖాళీలకి ఎనిమిదొందల ఐమీన్ ఎనిమిది వేల అప్లికేషన్సు వొచ్చాయన్నట్లు ! పాపం, కొత్తవాళ్లని కూడ పైకి తెద్దాం మరీ 'ఖడ్గపాణి'వి కాబోకు "

"నువ్వు నమ్మవేమొ కానీ, నేను ఎన్నుకున్న అయిదు ఉన్నత ప్రమాణాలున్న కథల రచయితల్లో నలుగురు మరీ కొత్తవాళ్లు ! పేరు, ప్రఖ్యాతులున్న వాళ్ళు కారు "

"అలాగని అందర్నీ కొత్తవాళ్లని పెడితే పత్రిక ఎవరూ కొన్రరోయ్!" గాభరా పడ్డాడు,రాజు

"అందుకేం ఫర్వాలేదు!—పెళ్లిగ్రాంల మీద తెప్పించుకునే ప్రసిద్ధ రచయితల కథలున్నాయి కదరా? మనం హోటలుకి ఫోను చేసి 'ఆర్డర్' బుక్ చేస్తే తినుబండారాలొచ్చినట్లు వచ్చిపడతాయి. ఎటొచ్చీ, కాస్త బెట్టుకొడతారు, అడగ్గానే పంపిస్తే పలచనైపోతామని!"

"నీకు మనవాళ్లు రచయితగా ఏలా పట్టం కట్టార్రా?"

"నువ్విప్పుడు ఎడిటర్‌గా పట్టం కట్టినట్లే!"

* * *

"పత్రిక కాస్త నిలబడుతోంది ప్రకటనలు బతికిస్తున్నాయ్! అన్నట్లు—రచయితలకి పారితోష కాలు సరిగా పంపిస్తున్నావా?"

"పారితోషకాలా?! వాళ్లకథ అమ్ముకోవడం కంటే పారితోషకం ఏమివ్వాలోయ్!"

"ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారమా అన్నట్లు... నీ పత్రికలో కథలు అచ్చువేసుకున్నంతలో వాళ్లకు ఉపకారం చేసినట్లెలా అవుతుంది?"

"మరి ఎంతమంది కొత్త రచయితలకి ప్రోత్సాహం ఇస్తున్నాం మనం?! అదెంత రిస్కు!"

"ఔరా ! యిదా నీ ప్రజాసేవ!" ఆశ్చర్య పోయాను.

"పత్రిక నిలబడే దాకానేరా. నిలబడితే 'పేరు' మీద నడిచిపోతుంది "

"ఊరు పేరుచెప్పి కాయలమ్ముకున్నట్లు! మైడియర్, నీ అపోహల్లోంచి బయటపడు. ఇప్పటికే మనకు వచ్చే కథల్లో తేడా కన్పిస్తోంది ప్రారంభ సంచికలోని రచయితలక్కూడా నువ్వు పారితోషికం పంపి ఉండవు! అందుకే వాళ్లనుండీ మళ్లీ రచనలు రాలేదు ఇలాగయితే, పత్రిక మూతపడక తప్పదు ఒట్టి చవకబారు కథలు, ఊసుపోక కబుర్లు, సినిమా బొమ్మలు—వీటితో పత్రికని మరీ హీనం చెయ్యకూడదు "

"అంటే—డబ్బిస్తేగానీ రచయితల మేధస్సు పని చెయ్యదన్నమాట ? అయితే, వీళ్లు రచనల్లో ప్రదర్శించే ఔన్నత్యం సంగతేమిటి? ఆచరణలో అదేమి నిలవదా ?"

నవ్వేను.

"నీ మాటలకి ఆచరణకీ ఎంతభేదం ఉంది? మనం సాహిత్య ప్రయోజనాలకి పత్రిక మనుగడకవ పరమైన వ్యాపార సూత్రాలకి ఎలాంటి రాజీ కుదిర్చాం ?"

రాజు బుర్ర గోక్కున్నాడు

"చూడు రాజా! దారంతో బట్టలు నేయ వచ్చు కుట్టవచ్చు యీ రెంటికీ పనితనం కావాలి. ఆ పనితనంలో కూడ ప్రావీణ్యత ఉండాలి. ఏమీ తెలియని వాడికి దారవు ఉండయిస్తే చెల్లాచెదురు చేసి, చిక్కుముళ్లు వేస్తాడు

రచయితలు కూడ యింతే! ప్రావీణ్యం ఉన్న వాళ్లని యితోధికంగా ప్రోత్సహిస్తే ఉత్సాహం పుంజుకుని కొత్త ప్రక్రియలు చూపుతాడు తను ఎదిగి, సంఘానికి పనికొచ్చే రచనలు చేస్తాడు "

"అలనాటి పోతన్నగారి కెవరుసాయం చేసారని కమ్మని కావ్యాలు రచించాడు ? సరస్వతీదేవి కన్నీళ్లకు కరిగి రాసానని చెప్పుకున్నాడు కదా ? ఆ విధమయిన 'సిన్సియారిటీ' ఎందుకుండదు యిప్పటి రచయితల్లో ?!"

నవ్వేను

"నీ సిద్ధాంత ప్రకారం సాహిత్య చరిత్రలో శ్రీనాధుడు గౌరవం పొంద తగదు! వాళ్లతో బాటు— నన్నయ్య, తిక్కన, యఱ్ఱాప్రగడ, అల్లసాని పెద్దన, తెనాలి రామలింగడు. "

"అవరా నీ జడివాన! ఒప్పుకుంటున్నా. : మనంకూడ పారితోషికాలిద్దాం "

"కనీసం యింత అని కూడ నిర్ణయిద్దాం "

"అదొకటా మళ్లీ ?"

"తప్పదు మరి!"

"సరే ఓ పాతిక రూపాయలిద్దాం"

"అదేమిట్రా ? పాల బకాయి కూడ తీరదు!"

"ముప్పై "

"ఇంటద్దె రాదు "

"నలభై "

"పావుమూట బియ్యం రాదు !"

"మనం వాళ్ల కుటుంబాలకి 'గార్డియన్స్'మా ఏమిట్రా ? యాభై రూపాయలకి మించి పావలా యివ్వను !" కోపంగా అరిచేడు

"మనం కథ కిచ్చే పారితోషకం మరో కథకి అందమైన ముగింపు అవుతుంటుంది రా ! అదే పండుగ రోజునో — చాలా రోజులుగా బకాయి పడ్డ బట్టల కొట్టువాడికి తృప్తి కలిగించి, కొత్త బట్ట లిప్పించవొచ్చు ఇల్లాలికి కొత్తచీర మోజు తీరచ్చు చదువుకునే కొడుక్కి 'ఫీజు'గా మారొచ్చు ఏ తీవ్ర అనారోగ్యానికో అవసరమయిన ఖరీదయిన మందుకో సరిపడొచ్చు. "

"ఒరేయ్, నీ కివన్నీ ఎలా తెల్సురా ?" ఆశ్చర్య పడిపోతూ అడిగేడు రాజు

చిరునవ్వుతో చెప్పాను —

"నేనూ రచయితనే గనుక !"